ఎంఎంటీఎస్ రెండో దశకు...

# ప్రభుత్వం పచ్చజెండా



న్యూస్‌టుడే, హైదరాబాద్

నగరంలో ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణను ఆమోదిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశకు రూ.641 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. అందులో మూడింట రెండొంతుల వ్యయాన్ని భరించేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో రెండో దశ విస్తరణకు మోక్షం లభించినట్లయింది.

రెండో దశ అంచనా వ్యయం రూ.641 కోట్లు. ఇందులో మూడింట రెండొంతుల వ్యయం అంటే రూ.427.33 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన మూడింట ఒకవంతు అంటే రూ. 213.67 కోట్లను రైల్వే మంత్రిత్వ శాఖ కేటాయిస్తుంది. రెండో దశ విస్తరణను సైతం రెండు దఫాలుగా చేస్తారు. మొదటి దఫాగా రూ.317 కోట్లు, రెండో దఫా కింద రూ.324 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. తొలి విడతగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రైలు మార్గాన్ని నిర్మిస్తారు. ఫలక్‌నూమా-ఉద్దంనగర్ మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయానికి రైలు సౌకర్యాన్ని కల్పిస్తారు. ఫలక్‌నూమా నుంచి ఉద్దంనగర్ వరకు ఉన్న మార్గాన్ని రెండు లైన్లుగా విస్తరిస్తారు. ఉద్దంనగర్ నుంచి అంతర్జాతీయ విమానాశ్రయం వరకు కొత్త మార్గాన్ని నిర్మిస్తారు. రెండో దశ విస్తరణలో బోగీలను కొనుగోలు కోసం రూ.85 కోట్లు కేటాయించారు.

**కేటాయించిన నిధుల వివరాలు**

- ఫలక్‌నూమ-అంతర్జాతీయ విమానాశ్రయం వరకు: రూ.85 కోట్లు
- తెల్లాపూర్-పటాన్‌చెరు మార్గానికి: రూ.32 కోట్లు
- సికింద్రాబాద్-బొల్లారం మార్గానికి: రూ.30 కోట్లు
- సనత్‌నగర్-మౌలాలీ: రూ.170 కోట్లు
- మౌలాలి-మల్కాజిగిరి-సీతాఫల్‌మండి మార్గనికి: రూ.25 కోట్లు
- బొల్లారం- మేడ్చల్ మార్గానికి: రూ.74 కోట్లు
- మౌలాలి-ఘటకేసర్ మార్గానికి: రూ.120 కోట్లు
- ప్రయాణికుల సౌకర్యాల కోసం: రూ.20 కోట్లు
- బోగీల కోసం: రూ.85 కోట్లు